క్లుప్తంగా

అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా బి.రాజేందర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఎక్సైజ్ సహకార సంఘం అధికారి ఎ.రాఘవేంద్రరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించి 11 మంది సభ్యులు ఉన్న సొసైటీలో 5 డైరెక్టర్ పోస్టులకు నామినేషన్లు స్వీకరించారు. 5 మంది మాత్రమే నామినేషన్లను దాఖలు చేయడంతో సొసైటీ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇందులో సొసైటీ అధ్యక్షుడిగా బి.రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా జి.భాస్కర్‌గౌడ్, కార్యదర్శిగా జి.సతీష్‌గౌడ్, డైరెక్టర్లుగా నర్సిములుగౌడ్, ఈ.ఖాజన్‌గౌడ్‌లు ఎన్నికైనట్లు వివరించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. అనంతరం కొత్త కార్యవర్గంతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. మూడేళ్ల పాటు కమిటీ కొనసాగనుంది.

జాతీయస్థాయిలో ప్రదర్శనకు అవకాశం

జడ్చర్ల టౌన్: తిరుపతిలో ఈనెల 20నుంచి అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ నిర్వహించే జాతీయస్థాయి పద్యనాటక ప్రదర్శనలో.. జడ్చర్ల నవజ్యోతి కళానిలయానికి అవకాశం లభించిందని రాష్ట్ర సంగీతనాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ తెలియజేశారు. 9రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనలో నవజ్యోతి కళానిలయం తరపున మైరావణ పద్యనాటక ప్రదర్శన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ ప్రతినిధులు లేఖను పంపించినట్లు తెలిపారు.

ఘననివాళి

జడ్చర్ల టౌన్: సంస్కార భారతి వ్యవస్థాపకుడు యోగీంద్రజీ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం జడ్చర్ల అనురాగిణి ఆశ్రమంలో ఘననివాళి అర్పించారు. సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్‌పీ నాయకుడు జగ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆయన కృషిచేశారన్నారు. దేశభక్తి పెంపొందించటానికి అనేక సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

రాజాపూర్: మండలంలోని దుందుభీ నది శివారులో అక్రమంగా ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సోమవారం తెల్లవారుజామున మలేపల్లి శివారులో కేజీబీవీ వెనుకాల పెట్రోలింగ్ చేస్తున్న, హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్, బ్లూకోర్టు సిబ్బంది రామకృష్ణరెడ్డి అక్రమంగా ఇసుక డంప్ చేస్తుండగా పట్టుకున్నారు. జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా పక్కా సమాచారం అందడంతో చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు డ్రైవర్లపై కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ రవితెలిపారు. మండలంలో ఇసుక నిషేధం ఉన్నదని అన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అప్పాజీపల్లిలో బడిబాట



బాలానగర్: మండలపరిధిలోని అప్పాజిపల్లిలో ఉపాధ్యాయులు సోమవారం బడిబాట నిర్వహించారు. చిన్నారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సీతాదేవి, అయ్యప్ప రెడ్డి పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ విద్యాశాఖ పారదర్శకంగా నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ అబ్దుల్‌ఘనిని కలుసుకుని వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. 2024 జూన్ 1వరకు ఖాళీలను ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్ లిస్టులో చేర్చాలని, సీనియార్టీ జాబితాలో తప్పులను సవరించాలని, స్పౌజ్ కేటగిరి, తప్పుడు వైద్య ధృవీకరణ పత్రాలు సమర్పించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలాజి, భీమయ్య, గోవింద్ పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ

మాగనూర్: మండలంలోని నల్లగట్టున మారెమ్మవ్వ ఆలయం వద్ద కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల ప్రధాన ప్రహరీ కూలిపోయి చాలారోజులవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కూలిన ప్రహరీతో విద్యార్థుల రక్షణ ప్రశ్నార్థకంగా మారుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ మరమ్మతులు చేపట్టి గేటు బిగించాలని కోరుతున్నారు.

అధ్వాన రోడ్లు



గుంతలుపడి అధ్వానంగా తయారైన రంగారెడ్డిపల్లి - పరిగి రోడ్డు

- వర్షాలతో మరిన్ని అగచాట్లు
- అవస్థలు పడుతున్న గ్రామీణులు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా వెన్నాచేడ్- లింగాయిపల్లి రోడ్డు

గండేడ్: మండల పరిధిలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అసంపూర్తి రోడ్లు, గుంతల దారులు మరింత అధ్వానంగా మారుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి అదే దుస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానపు రోడ్లకు మోక్షం ఎన్నడు కలుగుతుందో.. తమకు కష్టాలు ఎన్నడు తీరుతాయోనని ఎదురు చూస్తున్నారు. ఎక్కడ చూసిన మోకాలిలోతు గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని.. ముఖ్యంగా మట్టి రోడ్లు చినుకుపడితే చిత్తడవుతున్నాయని వాపోతున్నారు. ఫలితంగా కాలినడకన వెళ్లాలన్న కష్టతరమౌతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల నిధులున్నా కూడా పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో సమస్యలు అలాగే ఉన్నాయని చెబుతున్నారు. అవస్థలు పడుతున్నా అధికారులు, కాంట్రాక్టర్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు.

మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి, లింగాయిపల్లి, జక్లపల్లి, జిన్నారం, రాసులబండ తండా, పరుగుల తండా తదితర రోడ్లు అధ్వానంగా మారాయి. వీటిలో కొన్ని అసంపూర్తిగా ఉంటే మరికొన్ని అసలే ప్రారంభం కాలేదు.

ఆయా చోట్ల పరిస్థితి ఇలా..

- రంగారెడ్డిపల్లి నుంచి పరిగి వెళ్లే రహదారి సాధారణంగా బొంరాస్‌పేట్, చెవేళ్ల, మొయినాబాద్, హైదరాబాద్‌లకు వెళ్లడానికి మండల వాసులకు అనుకూలంగా ఉంటుంది. దూరం తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. గండేడ్ మండలం ఇంకా పరిగి నియోజకవర్గంలో ఉండడంతో ఆయా పనుల నిమిత్తం మండల వాసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాగా రంగారెడ్డిపల్లి నుంచి దోమ మండలం గుండాల్ తండా వరకు 6.7 కిలోమీటర్ల వరకు మండల పరిధిలో ఉంది. ఈ రోడ్డు మరి దారుణంగా ఉండడంతో వాహనదారులు జంకుతున్నారు. అడుగడుగునా మోకాలిలోతు గుంతలు ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని చెబుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. నిధులు మంజూరు చేసి, టెండర్లు పూర్తి చేసినా ఇప్పటివరకు పనులు చేపట్టలేదని చెబుతున్నారు. ఈ రూట్లో బస్సు సౌకర్యం కూడా లేదని.. దీంతో ఆటోలే దిక్కయ్యాయని.. కానీ రోడ్డు బాగలేకపోవడంతో వారు కూడా జంకుతున్నారని చెబుతున్నారు. రోడ్డు బాగాలేకపోవడంతో అత్యసర సమయాల్లో చాలా సమస్యగా మారుతోందని చెబుతున్నారు.
- చెల్మిల్ల గేటు నుంచి జిన్నారం తండా వరకు మంజూరైన బీటీ రోడ్డు సైతం అసంపూర్తిగా ఉంది. కేవలం కంకర వేసి వదిలిపెట్టారు. సంవత్సరాలు గడుస్తున్నా పనుల్లో ప్రగతి లేదు. ఎన్నిసార్లు మండల సమావేశాల్లో దీనిపై లేవనెత్తినా ఫలితం లేకపోయింది. కనీసం కంకర వేయకుండా వదిలేసినా మట్టి రోడ్డు అయినా బాగుండేదని ప్రజలు అంటున్నారు.
- అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు వెన్నాచేడ్-లింగాయిపల్లి బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. నెల రోజుల్లో నిర్మాణం పూర్తి చేస్తామని అప్పటి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ పనులకు మోక్షం లేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది కలుగుతోంది.
- గోవింద్‌పల్లి బీటీ రోడ్డుకు సైతం కంకర వేశారు కానీ బీటీ పనులు చేయలేదు. వేసారు బిటి పనులు కావాల్సి ఉంది.
- పరుగుల తండా, జక్లపల్లి, జిన్నారం , మల్‌రెడ్డి పల్లి గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. గుంతలు పడడంతో పాటు చినుకుపడితే కాలు కదపలేని పరిస్థితి. ఏళ్ల తరబడి అవస్థలు పడక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కష్టాలు తీరుతాయా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

అవస్థలు పడుతున్నాం



రోడ్లు అధ్వానంగా ఉండడంతో అవస్థలు తప్పడం లేదు. అటు వెన్నాచేడ్, కోస్గి వెళ్లాలన్నా.. ఇటు మహబూబ్‌నగర్, పరిగి, హైదరాబాద్ వెళ్లాలన్నా కష్టాలు పడాల్సి వస్తోంది. అడుగుకో గుంత పడి ప్రయాణించడానికి అడ్డంకి మారుతోంది. అధికారులు నిధులున్నాయని చెబుతున్నారే తప్ప పనులు ప్రారంభించడం లేదు.

– కత్తెరి తిరుపతయ్య, లింగాయిపల్లి

నోటీసులు ఇచ్చాం

రంగారెడ్డిపల్లి-పరిగి రోడ్డు పనులు ప్రారంభించాలని చాలా సార్లు చెప్పాం. వేరేచోట పనులు నడుస్తున్నాయి అవి కాగానే చేస్తామని కాంట్రాక్టు వారు చెప్పారు. త్వరిత గతిన పనులు చేపట్టాలని ఒత్తిడి తెస్తూనే ఉన్నాం. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చాం. వారం రోజల తర్వాత మళ్లీ కాంట్రాక్టరుతో మాట్లాడతాం. పనులు చేయకపోతే తగు చర్యలు తీసుకుంటాం.

– సంధ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

తూముల మరమ్మతుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



వెన్నాచేడ్ పెద్ద తూము వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

గండేడ్: 'తూముల మరమ్మత్తు చేయరా?' శీర్షికన ఈనెల 9న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెన్నాచేడ్ పెద్ద చెరువు తూములకు మరమ్మతు పనులను సోమవారం ప్రారంభింపచేశారు. చేవెళ్ల డివిజన్ ఇరిగేషన్ ఈఈ రేణుక ఆదేశాలతో వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పనులు చేయించారు. ముందుగా చిన్న తూము వద్ద ఉన్న రంధ్రాలను సిమెంట్ కాంక్రీట్‌తో మూయించారు. తర్వాత పెద్ద తూము షెట్టర్ రేకును సరిచేశారు. కాగా చెరువు రెండు తూముల నుంచి నీరు లీకవుతోందని.. ఏటా నీరు వృథా పోతున్నదని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో కథనం ప్రచురితమైంది. కాగా సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషిచేసిన సాక్షికి రైతులు ధన్యవాదాలు తెలిపారు.

కులగణన తర్వాత ఎన్నికలు నిర్వహించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న బీసీసేన నాయకులు

జడ్చర్ల టౌన్: కులగణన చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వానికి తమ విన్నపాన్ని పంపించాలని స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి సోమవారం ప్రజావాణిలో బీసీసేన నాయకులు వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ఒకేరోజులో సమగ్రకుటుంబ సర్వేనిర్వహించిన విషయాన్ని వినతిపత్రంలో పొందుపర్చారు. అదేవిధంగా రాష్ట్రంలో కులగణన సైతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కులగణన చేపట్టి ఎన్నికలు నిర్వహించాలని విన్నవించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీసీసేన నాయకులు నిరంజన్, నర్సింహులు, గోపాల్, వెంకటేశ్, శివశంకర్, రాములు, సుధాకర్, జహంగీర్‌లు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం



వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న గ్రామస్తులు

నవాబుపేట: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర ఆధ్వర్యంలో టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్‌చంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టీబీపై అవగాహన కల్పించి.. వ్యాధిని మొదటి దశలో గుర్తించి దాన్ని నిర్మూలించే అంశాలపై ప్రజకు వివరించారు. కాగా టీబీ రహిత సమాజం లక్ష్యంగా ప్రతి వ్యక్తి కృషి చేయాలని దీనికి వైద్య సిబ్బందికి సహకరించి సమాచారం అందించాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది సైతం గ్రామాల్లో అనుమానితులను గుర్తించి వారికి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని కావాల్సిన పరీక్షలు చేసి, మందులు అందించాలని ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో వ్యాధి అనుమానాలు ఉన్న 159 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ శ్రీనివాస్‌లు, శరభలింగం, శ్రీను, వినోద, బాల్‌రాజ్, రాజు, కృష్ణ, పుష్ప, కమల, ప్రమీల, నూర్జహాన్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన



పాతతోట ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కోనాపాలమూరు, షాబజార్, మహాత్మాగాంధీ రోడ్ ఉన్నత పాఠశాలలతో పాటు రాజేంద్రనగర్, కోనాపాలమూరు, పాతతోట ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గుర్తించిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, అదనపు తరగతి గదుల నిర్మాణం, భవనాల మరమ్మతు, రంగులు వేయడం, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్ మహమ్మద్ అబ్దుల్ రషీద్ (ముస్తాక్), కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ యు.బస్వరాజ్, డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈలు హరికృష్ణ, వైష్ణవి, సాయికృష్ణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలోని ముఖ్యమైన రోడ్లను ఆర్ అండ్ బీ శాఖకు మార్చాలన్నారు. అలాగే స్థానికంగా ఉన్న పాత భవనాలకు అవసరమైన మరమ్మతు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈలు సంధ్య, శ్రవణ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ



కోయిల్‌కొండలో దుస్తుల సరఫరా

హన్వాడ: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు సోమవారం మండల విద్యాధికారి రాజునాయక్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 64 పాఠశాలలకు గాను మొత్తం 45వేల పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. అదేవిధంగా నోట్‌పుస్తకాలను కూడా అందజేసినట్లు వివరించారు. ఇంకా పలు తరగతులకు అందాల్సి ఉందని, వాటిని కూడా సకాలంలో అందజేయనున్నామని తెలిపారు. స్థానిక కేజీబీవీలో నిల్వ చేసిన పుస్తకాలను పంపిణీ చేసిన కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన లభిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కాళప్ప, మండలవిద్యాధికారి లక్ష్మణ్‌సింగ్‌నాయక్, డీపీఎం నాగమల్లిక సూచించారు. సోమవారం మండలంలోని ఎమ్మార్సీలో విద్యార్థుల ఉచిత యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న75 పాఠశాలలకు సంబంధించి 2,900 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు. ప్రభుత్వపాఠశాలలో చదువుతోపాటు ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, ఉచితంగా నోటుపుస్తకాలు, మధ్యాహ్నభోజనం వంటి వసతులు ఉంటాయన్నారు.



హన్వాడలో..

చిన్నచింతకుంట: మండలంలోని కేజీబీవీ సిబ్బందికి విద్యార్థులకు సంబంధించిన దుస్తులను ఎంపీడీఓ సురేందర్‌రెడ్డి సోమవారం అందజేశారు. ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. మౌలిక వసతులు కల్పిస్తు పాఠశాలల ప్రారంభానికి ముందే దుస్తులను అందిస్తుందన్నారు. మహిళ సమాఖ్య ఏపీఎం విష్ణు చారి, మండల కోఆప్షన్ మెంబర్ మహిమూద్, ఎస్ వెంకటేష్ తదితరులు పాల్గొదన్నారు.



చిన్నచింతకుంటలో..

ఎంఆర్‌సీకి చేరిన పుస్తకాలు

బాలానగర్: మండల పరిదిలోని 54 ప్రభుత్వ పాఠశాలకు పంపిణీ చేయడానికి సంబంధిత పాఠ్యపుస్తకాలు ఎంఆర్‌సీకి చేరినట్లు ఎంఈఓ వెంకటయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 4,200 మంది విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 19,200 పుస్తకాలు, 24,645 నోట్‌బుక్స్ వచ్చాయని వివరించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభం అయిన తర్వాత విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గంలోని పలువురు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు ఇచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డబుల్‌బెడ్‌రూం, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, పెన్షన్లకు సంబంధించి పలువురు ఎమ్మెల్యేకు వినతులు ఇవ్వగా వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ వల్ల కొన్ని రోజులుగా ప్రజల వినతులు తీసుకోలేకపోయామని, ఇకనుంచి ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు పలువురికి ఎల్ఓసీలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

భూత్పూర్: పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని విండో సీఈఓ రత్నయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఏపీ, యూరియా తదితరాలను సరిపడా రైతులకు సరఫరా చేయనున్నట్లు వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షత్రియ సమాజ్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులను అభినందిస్తున్న సమాజం పెద్దలు

నారాయణపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా నివసిస్తున్న క్షత్రియ సమాజ్‌కు చెందిన కుటుంబాల్లోని విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చక్కటి ఫలితాలు సాధించిన వారికి సోమవారం ప్రోత్సహకాలు అందించారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబాభవాని మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టెన్త్‌లో చక్కటి జీపీఏ, ఇంటర్‌లో మంచి మార్కులతోపాటు ఐఐటీ, నీట్‌లో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు శాలువాతో సన్మానించి ప్రశాంసాపత్రం, జ్ఞాపికలు అందించారు. ఈ మేరకు.. వక్తలు మాట్లాడుతూ.. శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో నాగురావునామాజీ, నారాయణరావు, లక్ష్మణ్, శ్రావణ్, రాజ్‌కుమార్, నందునామాజీ, రేణుక, ప్రమీలాబాయి, హన్మంత్‌రావు, అంబిక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకు



నల్లగుట్ట వద్ద నిరుపయోగంగా నీటి ట్యాంకు

- మరోటి శిథిలావస్థలో..



బీటలు వారిన ట్యాంకు

భూత్పూర్: మున్సిపాలిటీలోని 1వ వార్డులో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. వివరాల్లోకి వెళ్తే.. రూ.లక్షల వ్యయంతో 1వ వార్డులోని నల్లగుట్ట తండా, సిద్దాయిపల్లి సమీపంలోని డబుల్‌బెడ్ గదుల వద్ద మిషన్ భగీరథ పథకం ద్వారా రెండు నీటి ట్యాంకులు నిర్మించారు. నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ట్యాంకులకు మాత్రం నీటితో నింపడం లేదు. దీంతో ఇటీవల వేసవి కాలంలో డబుల్ బెడ్‌రూం వద్ద తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులకు గురైనారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వలేదు. నల్లగుట్ట తండా వద్ద నీటి ట్యాంకు బీటలు వారి కూలడానికి సిద్ధంగా ఉన్నా మిషన్ భగీరథ ద్వారా నీరు ఎక్కిస్తున్నారు. తండా రైతులు ఈ నీటినే వాడుకుంటున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ నియంత్రిక

అడ్డాకుల: మండలంలోని గౌరిదేవిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ముందు వ్యవసాయ పొలంలో విద్యుత్ నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ పాఠశాలకు దగ్గరలోనే తక్కువ ఎత్తులో నియంత్రిక ఏర్పాటు చేయడం వల్ల పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలలు మొదలై పాఠశాల విరామ సమయంలో ఆడుకునే పిల్లలు అటు వైపుగా వెళ్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. నియంత్రిక చుట్టూ కనీసం రక్షణ కంచె కూడా లేదు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



తిరుమలలో హరినామ సంకీర్తన



ధన్వాడ: తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం ధన్వాడకు చెందిన అలుగుల ఆంజనేయస్వామి భజన మండలి వారు తిరుమల సంకీర్తనలో పాల్గొన్నారు. తిరుమల దేవస్థానంలో సంకీర్తనలు ఆలపించినట్లు కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు నారాయణ, నర్సింహులు, వెంకటయ్య, రాములు, కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, నారాయణస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.